క్లుప్తంగా

ఆర్డీఓకు వినతి



నర్సంపేట : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాప్ చేసిన ప్రభుత్వం, వ్యక్తులపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపుమాపుతున్నాయన్నారు.కార్యక్రమంలో నాయకులు అఖిల్, వినయ్, పవన్, మిన్ను, అజయ్, భరత్, శశి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన బిర్రు రాజును యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ము రమేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అధికార పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువకులను పార్టీలో చేరే విధంగా కృషి చేస్తానన్నారు.

పక్షులను రక్షించుకోవాలి

నర్సంపేట : పక్షులు అంతరించిపోకుండా వాటి రక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఛాయా సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి డేవిడ్ అన్నారు. ఈ మేరకు జాతీయ పక్షి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పక్షులను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు అనేక పక్షులు అంతరించిపోతున్నాయన్నారు. భవిష్యత్ తరాలు రామచిలుకలను సైతం చూడలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు వసంతకుమారి, ప్రణవి, ప్రభాకర్, అనిత, సమత, మౌనిక, లావణ్య, రాధి ఉమ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



రాయపర్తి : మండలకేంద్రంతో పాటు ఆరెగూడెం గ్రామానికి చెందిన నాయకులు గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసినట్లు తెలిపారు. ఆరెగూడెంలో దేవాదుల ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోతుండగా రైతులు మంత్రిని కలిశామన్నారు భూములకు నష్ట పరిహారం త్వరగా అందేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన పద్మశాలి కులస్తులు కమ్యూనిటీహాల్ నిర్మాణం చేయాలనగా హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ మహేందర్‌జీ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్, బిల్లా సుధీర్‌రెడ్డి, సురేందర్‌రావు, పూస మధు, సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి ‘ఎర్రబెల్లి’ని కలిసిన ఎస్సై

వర్ధన్నపేట : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హన్మకొండ క్యాంపు కార్యాలయంలో ఎస్సై రామారావు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

గడ్డివామి దగ్ధం



రాయపర్తి : ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పంటుకొని దగ్ధమైన సంఘటన మండలంలోని జగన్నాధపల్లి కొత్తతండాలో గురువారం చోటు చేసుకుంది. తండాకు చెందిన బోడ సంతోష్, బోడ మధూకర్‌కు చెందిన 600 గడ్డికట్టలను వామిగా పేర్చారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది.ఫైర్ ఇంజన్ సహాయంతో పాటు, తండావాసులు మంటలను ఆర్పినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాయపర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పారుపల్లి సమ్మారెడ్డి, చిట్ల శోభారాణి తెలిపారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సామల పట్టాభి ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు.

సరికొత్తగా వరి సాగు

- డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు
- రైతుల్లో పెరుగుతున్న అవగాహన
- తక్కువ ఖర్చుపై అన్నదాతల ఆసక్తి



చంద్రుగొండలో డ్రమ్ సీడర్ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓలు

నెక్కొండ : నారు పోయాలి.. నీరు పెట్టాలి.. కూలీలతో నాట్లు వేయించాలి.. ఇవన్నీ పాతతరం వరి సాగు పద్ధతి.. కానీ మారిన ఆధునిక వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపి తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభం కోసం సరికొత్తగా సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.. వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతలు నూతన పద్ధతులు అవలంభిస్తున్నారు. వరి సాగులో కూలీలు, యంత్రాల కొరత అధిగమించడానికి, పెట్టుబడి తగ్గించుకోవడానికి, అధిక దిగుబడి సాధించేందుకు సాంకేతిక పద్ధతులు వినియోగిస్తు పంటలు సాగు చేస్తున్నారు. రోజురోజుకూ సాగుపై చేసే ఖర్చు పెరగడం, మరోవైపు కూలీల కొరత సమస్యలను అధిగమించేందుకు రైతులు డ్రమ్ సీడర్ వినియోగిస్తున్నారు. ఈ పద్ధతుల ద్వారా రైతులకు తక్కువ ఖర్చవుతుంది. దీంతో రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

డ్రమ్‌సీడర్‌తో ఎంతో మేలు..

యాసంగి సీజన్‌లో మండల రైతులు 13 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఇందులో 30శాతం డ్రమ్‌సీడర్, 30 శాతం వెదజల్లే పద్ధతిలో పంటసాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. డ్రమ్‌సీడర్‌తో ఎంతో మేలు ఉండడంతో వరిసాగుకు డ్రమ్‌సీడర్‌ను రూ.4వేల నుంచి రూ.5వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వెదజల్లడంతో నిర్దిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయి. కలుపు తీసే సమయంలో ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది. సాధారణ పంట సాగుతో పోల్చితే డ్రమ్‌సీడర్ విధానంతో 20 రోజుల ముందే పంట చేతికివస్తుంది.అదనంగా 3 నుంచి 4 బస్తాల దిగుబడినిస్తుంది. వినూత్న పద్ధతిలో చేపడుతున్న సాగు విధానాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

కూలీలు అవసరం లేదు



ఇదివరకు వరి సాగు చేయాలంటే కూలీల కొరతతో రైతులకు ఇబ్బందులు ఉండేవి. వ్యవసాయ అధికారుల సూచనలతో డ్రమ్‌సీడర్ విధానంతో వరి సాగు చేస్తాను. దీంతో ఖర్చు తగ్గడంతోపాటు కూలీల సమస్యల తీరుతోంది. సమయం తక్కువ, అధిక దిగుబడులు వస్తాయి.

- వద్దె కుమారస్వామి, రైతు, చంద్రుగొండ

ఇక, సాగు సులువే..



ఇక, డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులు రైతులకు సులువే. ఈ పద్ధతులతో కూలీల సమస్య, ఖర్చు కూడా తగ్గుతది. అన్నదాతలకు డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానంతో ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. సాధారణం కన్న ఈ పద్ధతితో 20శాతం యూరియా వాడకం తగ్గుతుంది. రైతుకు ఆశాజనకంగా దిగుబడి వస్తది.

- ఎగిడి నాగరాజు, ఏఓ, నెక్కొండ

చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌చంద్ర

నర్సంపేట రూరల్ : చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని, వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి. రికార్డులను సమర్థవంతంగా నమోదు చేసుకోవాలని భాంజీపేట వైద్యాధికారి అరుణ్‌చంద్ర సూచించారు. నర్సంపేట మండలంలోని భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 సబ్ సెంటర్‌లకు సంబంధించిన ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులను మొదటి నెల నుంచి తగు జాగ్రత్త పాటించేలా వివరిస్తూ వారికి తప్పనిసరిగా ఆస్పత్రిల్లో వైద్యపరీక్షలకు తీసుకురావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామకమిటీలను త్వరగా ఎన్నుకోవాలి



దుగ్గొండి: మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



సంగెం: గ్రామ కమిటీతో మండల నాయకులు

దుగ్గొండి : గ్రామాలలో పార్టీ కమిటీల ఎన్నికలను సకాలంలో పూర్తి చేయాలని నర్సంపేట కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావి పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన గ్రామ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. నర్సంపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడానికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, రామారావు, వలస రామ్మూర్తి, చెన్నూరి కిరణ్‌రెడ్డి, మాదాషి సాంబయ్య, ఆవుల నర్సింహారెడ్డి, నర్సింగరావు, జంగిలి రవి, పాలడుగుల రాజన్న, అంద్య రత్నాకర్‌రెడ్డి, నరిగె ప్రవీణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక

సంగెం : కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా మెట్టుపల్లి భాస్కర్, ఉపాధ్యక్షులుగా అనుమాస ప్రకాశ్, మెట్టుపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునుకుంట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన శ్రీనివాస్, కార్యదర్శి గుండేటి కోర్నెలు, సలహాదారుడుగా గుండేటి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడుగా గుండేటి రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, గుండేటి రాజు, శ్రీకర్, శేఖర్, సాంబయ్య, సునీల్, ఎల్లయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు(ఫైల్)

ఖానాపురం : పాకాల ఆయకట్టు పరిధిలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 2,465 మంది రైతుల వద్ద 3,58,519 ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. ఇందులో 2,180 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు సొసైటీ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఐనపల్లి, బండమీదిమామిడితండా, బుధరావుపేట, కొత్తూరు, మంగళవారిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగించారు. మిగిలిన మనుబోతులగడ్డ, ఖానాపురం, ధర్మరావుపేట, అశోక్‌నగర్ గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరినట్లు సొసైటీ అధికారులు తెలిపారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం..



పార్టీలో చేరిన వారితో డాక్టర్ రాణాప్రతాప్

చెన్నారావుపేట : నర్సంపేట గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అమీనాబాద్, పత్తినాయక్ తండా గ్రామాలకు చెందిన టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమీనాబాద్ మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ నిర్మల విజయ్, మామిండ్లపల్లి ఎస్ఎంసీ చైర్మన్ ఐత తిరుపతిలతో పాటు పలువురు నాయకులు చేరడం సంతోషకరమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే వరకు కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ రాంధన్, బానోత్ నర్సింగ్, వెంకన్న, రమేష్, దిలీప్‌లతో పాటు పలువురు ఉన్నారు.

రేపు మండలస్థాయి పోటీలు

వర్ధన్నపేట : మండల స్థాయి స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ ఇంగ్లిష్ పోటీలను రేపు(శనివారం) వర్ధన్నపేట జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించడం జరుగుతుందని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఇఎల్‌టీఏ, ఎల్టా) మండల కన్వీనర్ తాబేటి లింగమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యూకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(టీఎస్ ఎస్‌సీఈఆర్‌టీ), భారతి ఫౌండేషన్ సహకారంతో మండల స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఉదయం 9.30 గంటల లోగా పరీక్షకు హాజరు కావాలని అన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఎల్టా నిపుణుల బృందం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నల్లబెల్లి /చెన్నారావుపేట : ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(హెచ్-143) ద్వితీయ మహాసభలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు గొడిశాల సదానందం అన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నగంటి స్వామి, ఎర్రబెల్లి విద్యాసాగర్, పుల్లూరి శ్రీనివాస్, ఆకారపు స్వామి, మహ్మద్ వహీద్, బొనగాల రమేష్, దొంతి సుమన్, పడిదం శోభన్, యాదగిరి, రాజు, కర్ణాకర్, రంజిత్‌లు ఉన్నారు.

మద్యం షాపుల తనిఖీ

పర్వతగిరి : మండలంలోని వైన్స్ షాపులలో ఎక్సైజ్ సీఐ పవన్ గురువారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మద్యం బాటిళ్లలో కల్తీ జరుగుతుందనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు చేపట్టాలన్నారు. అనంతరం పర్వతగిరి గీతపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్యకు కోటి వరాల కింద 2003–04 సంవత్సరంలో భూమి కొనుగోలుకు సంబంధించిన వివరాలను సేకరించారు. మండల కేంద్రంలో తగలబెట్టిన తాటివనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలో గూడూరు కార్తీక్ అనే కౌలు రైతు ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా గురువారం బాధిత కుటుంబానికి ఓం నమఃశివాయ యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.5,500 నగదు అందించారు. యూత్ అధ్యక్షుడు సముద్రాల శ్రావణ్‌కుమార్, కైలాస సంతోష్‌కుమార్, మంద శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప మాలాధారులు గురువారం శబరిమలకు తరలి వెళ్లారు. పెనుగొండ మధుశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఇల్లంద అయ్యప్పస్వామి దేవాలయంలో శబరిమల యాత్రకు వెళ్తున్న దీక్ష దారులు ఇరుముడిలు కట్టారు. కార్యక్రమంలో బాలకుమార్, యాకయ్య, సతేందర్‌రెడ్డి, రవిశంకర్, కవిరాజు, అనిల్, వేణు ఉన్నారు.

సభను విజయవంతం చేయాలి



గీసుకొండ : ఎస్సీల ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి ఈ నెల 11న బెంగళూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని కొనాయమాకుల ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి కేంద్రంలోని బీజేపీ సర్కారు మోసం చేసిందన్నారు. ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిల్లు మహేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, మండల అధ్యక్షులు కాగిత అశోక్, ఇనుముల పూర్ణయ్య, మిట్టపల్లి రాధిక, చిన్నపెల్లి రవి, చిర్ర ఆనంద్, రాజేశ్, నాగయ్య, సతీష్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న బాధ్యులు

నర్సంపేట : సమాజంలో స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేటకు చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా కీలకమన్నారు. డివిజన్ వ్యాప్తంగా అంకితభావంతో సేవలు నిర్వహించడం సంతోషకరమన్నారు. సంస్థలకు తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్, బెజ్జంకి ప్రభాకర్, డేవిడ్, వసంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్‌లో కాలనీలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు రజిత, అనిత, అనసూయలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడిసెలకు బదులుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

జీతాలు వెంటనే విడుదల చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ఖానాపురం : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల డీఏలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు దూలం రాజేందర్, నాయుడు, సంఘం ప్రధాన కార్యదర్శి కరుణాకర్, శ్రీనివాస్, రాందాస్, కేశోజు లక్ష్మయ్య, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సంఘం అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిని

నర్సంపేట : మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గంగపుత్ర సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ పట్టణ గంగపుత్ర సంఘ భవనం మొదటి అంతస్తు కోసం మంజూరైన ఎంపీ నిధులతో అసంపూర్తిగా మిగిలిందన్నారు. కాగా అసంపూర్తి భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించుకోవడానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారాన్ని తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షురాలు గుంటి రమాదేవి, సంజీవ, సమ్మయ్య, కిషన్, నారాయణ, సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం గొర్రెకుంట శివారులోని 95, 524/ఎ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని కీర్తినగర్, జాన్‌పాక, గరీబ్‌నగర్, లేబర్ కాలనీల్లోని సొంత గూడు లేని పేదలకు పంచాలని గురువారం గీసుకొండ తహసీల్దార్ విశ్వనారాయణకు వినతిపత్రం అందజేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్(ఆర్‌పీఐ-ఏ)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూమిలేని పేదలు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. జీఓ 58, 59లను అమలు చేస్తూ వెంటనే పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి సాధిక్, హెచ్‌డి ఫర్హాన, ఉపాధ్యక్షులు రుద్రారపు హేమలత, సహాయ కార్యదర్శి ఎడ్ల రవి, గోవిందుల రవి, సలహాదారు బండి మధుబాబు పాల్గొన్నారు. అంతకు ముందు 95 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమి వద్ద ముళ్లపొదలను పేదలు తొలగించేందుకు ప్రయత్నించగా కొందరు రైతులు తమ పట్టా భూమి ఉందని అడ్డుకోవడంతో పాటు పోలీసులు వచ్చి వారిని నిలువరించారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు వినతిపత్రం అందజేశారు.

‘సదరం’ స్లాట్ కోసం ఇక్కట్లు

- సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల పడిగాపులు
- 9 నెలలుగా తప్పని ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు

నల్లబెల్లి : దివ్యాంగులకు స్లాట్ బుకింగ్ వారి పాలిటశాపంగా మారింది. ఏడాదికి పైగా స్లాట్ బుక్ చేసుకోవడంలో దివ్యాంగులు సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు మీనమేషాలు లెక్కించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే సదరం శిబిరం స్లాట్స్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో నల్లబెల్లి మండలంలో దివ్యాంగులు మీ-సేవా కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు. సదరం సర్టిఫికెట్స్ గడువు ముగియడంతో ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్లతో పాటు బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ కోల్పోతున్నారు. 2023లో మొదటి విడత స్లాట్స్‌ను జనవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జారీ చేయాల్సి ఉంది. గడువు ముగిసిన నేటికి స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించలేదు. ప్రభుత్వం ఎప్పుడు అవకాశం కల్పిస్తుందో తెలియకపోవడం, కల్పించిన సమయంలో రోజులో 30 నిమిషాలు మాత్రమే స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలియని దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు స్లాట్స్ బుక్ చేసేందుకు రోజు మీ సేవా కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు. దివ్యాంగులను మీ-సేవా కేంద్రాలకు తీసుకవచ్చేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగియడంతో పునరుద్ధరణకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లభించకపోవడంతో ఆసరా పింఛన్‌ను అధికారులు నిలిపివేస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన మనుగొండ దేవరాజు(దివ్యాంగుడు). రెండు కాళ్లు పని చేయకపోవడంతో గతంలో ఐదేళ్ల గడువుతో వైద్యులు సదరం సర్టిఫికెట్ జారీ చేయగా.. ఆసరా పింఛన్‌తో పాటు బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ పొందాడు. కాగా 9 నెలల క్రితం సదరం పత్రం గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం ఆసరా పింఛన్ నిలిపేసింది. పునరుద్ధించుకునేందుకు మీసేవా కేంద్రాల చుట్టు స్లాట్ బుక్ చేసుకునేందుకు తిరుగుతున్నాడు. కానీ ఫలితం లేకుండా పోతుంది. ఇది ఇతని ఒక్కడిదే కాదు. మండలంలో అనేక మంది దివ్యాంగుల దుస్థితి ఇలానే ఉంది. అధికారులు స్పందించి స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా..



స్లాట్ బుకింగ్ సమస్య ఉంది వాస్తమే. ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళ్లాం. స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- విజయ్‌కుమార్, ఎంపీడీఓ, నల్లబెల్లి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పి.చంద్రశేఖర్(A.C.O): 8074606274